ప్రసాద్ స్కీం పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర

వెంకటాపూర్, మార్చి 4 : రామప్ప దేవాలయానికి రానున్న రోజుల్లో విదేశీ పర్యాటకులు పెద్ద ఎత్తున రానున్నారని, ప్రసాద్ స్కీమ్ ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. మంగళవారం ఆయన అభివృద్ధి పనులను క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మే రెండో తేదీన ప్రపంచ సుందరి పోటీలు జరుగుతున్న నేపథ్యంలో పలు దేశాలకు చెందిన పోటీ మహిళలు హైదరాబాద్‌కు రానున్నారని, ఈ క్రమంలో జిల్లాలోని పర్యాటక స్థలాలను పర్యటించే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని సంబంధిత శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పనులను ఏప్రిల్ 20లోపు పూర్తి చేయాలని, ఆలయ పరిసరాల్లో గ్రీనరీ పెంచాలని సూచించారు. ఆర్డీవో వెంకటేశ్, డీపీవో దేవరాజ్, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ డాక్టర్ కుసుమ సూర్యకిరణ్, పర్యాటక అభివృద్ధి సంస్థ ధనరాజ్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విజయ్‌కుమార్, ఎంపీడీవో రాజు, తహసీల్దార్ గిరిబాబు, ఎంపీవో విష్ణువర్ధన్ ఉన్నారు.

పోలీస్ స్టేషన్ వద్ద నిర్బంధంలో ఉన్న అంగన్‌వాడీ టీచర్లు

పోలీస్ స్టేషన్‌లో అంగన్‌వాడీల నిర్బంధం

కన్నాయిగూడెం, మార్చి 4 : మండలంలోని అంగన్‌వాడీ టీచర్లను మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద పోలీసులు నిర్బంధించారు. ప్రజా భవన్ ముట్టడి చేస్తున్నారనే సమాచారంతో పోలీసులు వారిని ఉదయం నుంచే పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీల సమస్యలతో కూడిన వినతిపత్రం ప్రజావాణిలో ఇచ్చేందుకు వెళ్తుండగా ముందస్తు అరెస్టు చేయడం సరికాదన్నారు. వారిలో అంగన్‌వాడీ టీచర్లు సూరమ్మ, పార్వతి, యశోద, లక్ష్మి, రంగమణి, సుగుణ, అనిత, నర్సమ్మ ఉన్నారు.

అక్రమ అరెస్టులు సరికాదు

ములుగురూరల్ : సమస్యల పరిష్కారం కోసం మినీ అంగన్‌వాడీలు హైదరాబాద్‌కు వెళ్తుండగా మంగళవారం ఉదయం పోలీసులు అరెస్టు చేసి స్టేషన్లకు తరలించారని, దీనిని ఖండిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాజేందర్ తెలిపారు. మంత్రిగా సీతక్క బాధ్యతలు చేపట్టిన అనంతరం మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ అంగన్‌వాడీలుగా అప్‌గ్రేడ్ చేస్తామని సంతకం చేశారని గుర్తు చేశారు. పెరిగిన వేతనాలను 11 నెలలుగా చెల్లించడం లేదన్నారు. ములుగు మండలం జంగాలపల్లిలో పనిచేస్తున్న మినీ అంగన్‌వాడీ టీచర్లు భవాని, సుజాతను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారని అన్నారు. కాగా, జిల్లాలో మొత్తం 110 మంది సిబ్బందిని నిర్బంధించి వదిలివేశారని తెలిపారు.

ఇసుక క్వారీల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

మంగపేట, మార్చి 4 : మండలంలోని చుంచుపల్లి గ్రామ చెంచులక్ష్మి గిరిజన ఇసుక క్వారీ సొసైటీ, నర్సింహస్వామి గిరిజన ఇసుక క్వారీ సొసైటీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని ఆదివాసీ సేన మండల అధ్యక్షుడు పోలెబోయిన ఆదినారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 2002కు సంబంధించి సొసైటీకి రూ.40 లక్షలు, 2023 – 2024 సంవత్సరానికి రూ.80 లక్షలు, ఐదో నంబర్ ఇసుక రీచ్‌కు సంబంధించి రూ.40 లక్షలు రావాల్సి ఉందన్నారు. మొత్తంగా సుమారుగా రూ.1.60 కోట్లు రావాలన్నారు. ఈ బిల్లులను హైదరాబాద్ టీజీఎండీసీ శాఖ, స్థానిక ఏటూరునాగారం టీజీఎండీసీ పీవోల పర్యవేక్షణలో వేబిల్లులు, సంబంధిత పత్రాలను పరిశీలించి గిరిజన సొసైటీలకు, అలాగే రైజింగ్ కాంట్రాక్టర్లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని కోరారు.

ఇంటర్ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి రూరల్, మార్చి 4 : ఇంటర్మీడియట్ పరీక్షలు పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ రాహుల్‌శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించారు. ఏర్పాట్లు, పరీక్షా హాల్‌లో పరిస్థితులు, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, సీసీ కెమెరాలు, మార్గదర్శకాల అమలును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 8 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఈ నెల 5 నుంచి 25 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. జిల్లాలో 34 ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలు ఉండగా ప్రథమ సంవత్సరంలో 1,820, ద్వితీయ సంవత్సరంలో 1,795 మంది మొత్తం 3,615 మంది పరీక్షలకు హాజరవుతున్నారని తెలిపారు. 220 మంది ఇన్విజిలేటర్లు, 16 మంది సీఎస్, డీవోలు, మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ జరుగకుండా చూసేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్, రెండు సిట్టింగ్ స్క్వాడ్లను నియమించామన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించామని అన్నారు. ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థుల సౌకర్యం 8008878060 నంబర్‌తో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామని, సమాచారం కోసం ఆ నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

అనంతరం డిగ్రీ, జూనియర్ కళాశాలలో నీట్ పరీక్షా కేంద్రం ఏర్పాటుకు సౌకర్యాలు పరిశీలించారు.

బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయండి

కొడవటంచ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు 9 నుంచి 26వ తేదీ వరకు జరుగనున్నందున భక్తులకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. మంగళవారం ఐడీవోసీ కార్యాలయంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పాటు ఆవరణలో సెంట్రల్ లైటింగ్ లైట్లు పెట్టాలని ఆదేశించారు. జాతరకు వచ్చే కొడవటంచ బైపాస్, రేపాక కొడవటంచ రోడ్, గూడెపల్లి-కొడవటంచ దారుల్లో అడ్డంగా ఉన్న ముళ్ల పొదలు తొలగించాలని అన్నారు. మొరం పోసి గుంతలు పూడ్చాలన్నారు. తాత్కాలిక బస్టాండ్, పార్కింగ్ స్థలాలను గుర్తించి భక్తులకు అందుబాటులోకి తేవాలని సూచించారు. స్నాన ఘట్టాల వద్ద మహిళలు బట్టలు మార్చుకొనే గదులు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రత్యేక విధులు నిర్వహించేందుకు రెవెన్యూ సిబ్బందిని డిప్యూట్, భక్తుల రద్దీని అనుసరించి పోలీసు బందోబస్తు ఏర్పాటు, ప్రోటోకాల్ ప్రకారం దర్శనం కల్పించాలని అన్నారు. భూపాలపల్లి డిపోతో పాటు ఇతర జిల్లాల నుంచి భక్తుల సౌకర్యార్థం నిరంతరం ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ డీఎంకు సూచించారు. సింగరేణి కాలరీస్ నుంచి స్కాట్స్ సిబ్బంది క్యూలైన్ మెయింటెనెన్స్, భక్తులకు తాగునీరు సరఫరా చేసే సేవలు అందించాలని కలెక్టర్ అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఇంటర్మీడియట్ అధికారి వెంకన్న, డీపీవో నారాయణరావు, డీఎంహెచ్‌వో మధుసూదన్, ఆర్డీవో రవి, డీఎస్పీ సంపత్‌రావు, ఈవో మహేశ్, తహసీల్దార్, ఎంపీడీవో పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పుట్ట మధు పరామర్శ

భూపాలపల్లి రూరల్/ మల్హార్, మార్చి 4 : మృతుల కుటుంబ సభ్యులను మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. సోమవారం రాత్రి మహాముత్తారం మండలం మీనాజీపేట గ్రామానికి చెందిన పింగిలి రవీందర్ రెడ్డి, నర్సింహారెడ్డి (లడ్డు) ద్విచక్ర వాహనంపై వస్తుండగా భూపాలపల్లి మండలం పంబాపూర్ గ్రామానికి చెందిన సతీశ్ బైక్‌ను వేగంగా ఢీకొనడంతో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందారు. మృతదేహాలను పోలీసులు వంద పడకల ఆసుపత్రిలో భద్రపరిచారు. విషయం తెలుసుకున్న పుట్ట మధుకర్ మంగళవారం మధ్యాహ్నం వంద పడకల ఆసుపత్రికి చేరుకొని మృతదేహాలను పరిశీలించారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి రోడ్డు ప్రమాదానికి గల కారణాలను అడిగితెలుసుకున్నారు. అలాగే మల్హార్ మండలం తాడిచెర్ల గ్రామానికి చెందిన ఇందారపు దుర్గమ్మ, ఇందారపు మల్లేశ్, కిషన్, రావుపల్లికి చెందిన తోట చంద్రయ్య, అడ్వాలపల్లికి చెందిన అజ్మీరా రాజు కుటుంబాలను పుట్ట మధు పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మల్హార్ మండల అధ్యక్షుడు కుంభం రాఘవరెడ్డి, మాజీ జడ్పీటీసీ గోనె శ్రీనివాస్, సింగిల్ విండో మాజీ డైరెక్టర్ మల్క రాజేశ్వర్‌రావు, రావుల కల్పన, మొగిలి, నాయకులు యాదగిరిరావు, అజ్మీరా శంకర్‌నాయక్, నార రమేశ్, మాజీ సర్పంచులు బూడిద మల్లేశ్, బండారు సమ్మయ్య, అక్కపాక సమ్మయ్య, సిద్ధుల ఓదెలు, మంతెన సమ్మయ్య, గట్టయ్య, అడ్వాల రాజు, బానోత్ సమ్మయ్య, రాజేందర్, అజ్మీరా రాజునాయక్, శ్రీధర్, అడ్వాల రమేశ్, నాంపల్లి సురేశ్ ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని ఓదార్చుతున్న పుట్ట మధు

వరి పంటకు సాగు నీరు అందించాలి

ములుగురూరల్, మార్చి 4 : రామప్ప చెరువు నుంచి రంగాయ చెరువుకు వెళ్తున్న దేవాదుల పైప్ లైన్ ద్వారా ములుగు మండలంలో రైతులకు సాగు నీరు అందించాలని గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ గోవిందనాయక్ అన్నారు. మంగళవారం ఆయన బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సానికొమ్ము రమేశ్‌రెడ్డితో కలిసి దేవగిరిపట్నం, చింతలపల్లి, పత్తిపల్లి గ్రామాల్లోని వరి పంటలను పరిశీలించారు. సాగు నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పత్తిపల్లి శివారులో యాసంగిలో 100 ఎకరాల వరి పంట వేయగా నీరు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. రైతుల బాధలను దృష్టిలో ఉంచుకొని మంత్రి సీతక్క దేవాదుల పైప్‌లైన్ ద్వారా నీరు అందించాలని కోరారు. పైప్‌లైన్ వద్ద పాయింట్ ఏర్పాటు చేస్తే తొమ్మిది గ్రామాల రైతుల పొలాలకు సాగు నీరు అందుతుందన్నారు. లేకపోతే బీఆర్ఎస్ రైతులకు అండగా నిలిచి పోరాటం చేస్తుందని హెచ్చరించారు. నాయకులు సారయ్య, కరణ్‌సింగ్, వెంకటేశ్వర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.



వరిని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

లైంగికదాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదు

భూపాలపల్లి రూరల్, మార్చి 4 : బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి జీవిత ఖైదీ, రూ.25వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ కిరణ్ ఖరే తెలిపారు. మహాముతారం మండలం కనుకునూరు గ్రామానికి చెందిన అట్టెం మల్లయ్య (46) 2019 సంవత్సరంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అతడిపై అప్పటి మహాముత్తారం పోలీస్‌స్టేషన్ ఎస్సై రాము కేసు నమోదు చేశారు. అప్పటి కాటారం సీఐ శివప్రసాద్ నిందితుడిని అరెస్ట్ చేశారు. ఆ తర్వాత సీఐ హథీరాం మరి కొంతమంది సాక్షులను విచారించగా, అప్పుడు కాటారం డీఎస్పీగా, ప్రస్తుత అడిషనల్ ఎస్పీ కిషన్ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నిందితుడు అట్టెం మల్లయ్యపై నేరం రుజువు కావడం తో భూపాలపల్లి జిల్లా కోర్టు న్యాయమూర్తి నారాయణబాబు మంగళవారం నిందితుడికి జీవిత ఖైదు, రూ.25 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

కరాటేలో జీవన్‌తేజకు బంగారు పతకం

ఏటూరునాగారం, మార్చి 4 : మండలంలోని రొయ్యూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థి గజ్జెల జీవన్ తేజ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలో పాల్గొని బంగారు పతకం సాధించినట్లు కరాటే శిక్షకుడు ఇర్ప బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. 7వ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలను మేడారంలో నిర్వహించినట్లు తెలిపారు. అండర్–12 విభాగంలో వరంగల్, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన క్రీడాకారులతో పోటీపడి గెలుపొందినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో మల్లయ్య విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో చిన్నబోయినపల్లి ఆశ్రమ పాఠశాల హెచ్ఎం మడే నాగేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు రమేశ్, కిషన్, నాయుడు పాల్గొన్నారు.

తాగు ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

మహదేవపూర్, మార్చి 4 : ప్రజలకు తాగు నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలని ఎంపీవో ప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన మండలంలోని బెగ్లూర్ గ్రామంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. జీపీ రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. నర్సరీ పనులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. పారిశుధ్య పనులు పక్కాగా ఉండాలని ఆదేశించారు.

రంజాన్ ఏర్పాట్లను పూర్తి చేయాలి

ములుగురూరల్, మార్చి 4 : రంజాన్ మాసం ప్రారంభమైన నేపథ్యంలో ముస్లింలకు కావాల్సిన సౌకర్యాలపై అధికారులు దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్‌రెడ్డితో కలిసి అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ముస్లింలకు లోటుపాట్లు లేకుండా ఈద్గాలు, మసీదుల వద్ద ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో అధికారులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

పుట్‌పాత్‌ను ఆక్రమిస్తే జరిమానా

ములుగురూరల్, మార్చి 4 : జిల్లాకేంద్రంలో జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న పుట్ పాత్‌ను ఆక్రమించి వాహనాలు నిలిపినా, దుకాణాల సామగ్రి పెట్టినా రూ.2 వేల జరిమానా విధించనున్నట్లు జీపీ ఈవో పెంట రఘు మంగళవారం తెలిపారు. మంగళవారం ఆయన సిబ్బందితో ప్రతీ దుకాణాదారుడికి నిబంధనలు వివరించారు. అనంతరం మాట్లాడుతూ పుట్‌పాత్‌ను ఆక్రమించడంతో జాతీయ రహదారిపై పాదచారులు నడుస్తున్నారని, దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. పుట్‌పాత్‌ను ఆక్రమిస్తే ఫొటోలు తీసి ఫైన్ వేయనున్నట్లు తెలిపారు. అలాగే దుకాణాదారులు షాపుల పేర్లతో ఉన్న ఫ్లెక్సీలను పుట్ పాత్ గేట్ల వద్ద అమర్చవద్దని, వాటిని సైతం తొలగించాలన్నారు.

ఐహెచ్ఆర్‌సీ జిల్లా అధ్యక్షుడిగా వెంకన్న

ములుగురూరల్, మార్చి 4 : అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ అధ్యక్షుడిగా బానోత్ వెంకన్న నియామకమయ్యారు. నియామకానికి సహకరించిన మానవ హక్కుల కమిషన్ సౌత్ ఇండియా అధ్యక్షుడు షేక్ గౌస్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

జోరుగా 'లోకల్ సీరియల్ దందా'

మహదేవపూర్ (కాళేశ్వరం), మార్చి 4 : మండలంలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఇసుక క్వారీల్లో లోకల్ సీరియల్ దందా జోరుగా సాగుతున్నది. పలువురు లోకల్ వ్యక్తుల పేరిట ఇసుక లోడింగ్‌కు కొత్త దందాకు తేరలేపి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇసుక లారీలు నిర్దేశిత మార్గంలోనే లోడింగ్ వెళ్లాలని పోలీసులు డ్రైవర్లను హెచ్చరించినా వారు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మంగళవారం పలువురు వ్యక్తులు తాము లోకల్ అంటూ నిర్దేశిత మార్గం ద్వారా కాకుండా రాంగ్ రూట్‌లో నేరుగా ఇసుక క్వారీ లోడింగ్ వద్దకు లారీలను చేర్చుతూ అందినకాడికి దండుకున్నారు. క్వారీల వద్ద ముందు సీరియల్ ఇప్పించి ఒక్కో లారీకి రూ.వెయ్యి నుంచి రూ.4 వేలు వసూలు చేసినట్లు సమాచారం. జిల్లా ఉన్నాతాధికారులు దృష్టిసారించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బొమ్మాపూర్ క్రాస్ రోడ్డు గుండా లోడింగ్‌కు వెళ్తున్న లారీ

విద్యుత్ వినియోగదారుల సదస్సు

వెంకటాపురం (నూగూరు), మార్చి4 : మండలకేంద్రంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సదస్సును ఆ శాఖ అధికారులు నిర్వహించారు. వెంకటాపురంతోపాటు వాజేడు మండలాలకు చెందిన రైతులు హాజరై విద్యుత్ సమస్యలపై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ వేణుగోపాలాచారి, ఏడీఏ అకిటి స్వామి, రైతులు పాల్గొన్నారు.

నీటి విడుదల

ములుగురూరల్, మార్చి 4 : పత్తిపల్లి గ్రామ శివారులోని ఎదర్ల చెరువు ఆయకట్టు వద్ద దేవాదుల పైప్‌లైన్ పాయింట్ వద్ద మంగళవారం గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ బానోతు రవిచందర్ నీటిని విడుదల చేశారు. యాసంగి సీజన్‌లో రైతుల అవసరాల మేరకు సాగు నీటిని అందించేందుకు దేవాదుల నీటిని విడుదల చేసినట్లు రవిచందర్ తెలిపారు.

వాటర్ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశానికి దరఖాస్తులు

ఏటూరునాగారం, మార్చి 4 : గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మోడల్ స్పోర్ట్స్, వాటర్ స్పోర్ట్స్ అకాడమీ– 2025–26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గిరిజన సంక్షేమశాఖ డీడీ పోచం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో 40 సీట్లు ఉన్నట్లు తెలిపారు. బోయినపల్లిలోని వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో బ్యాక్‌లాగ్‌లో 6వ తరగతిలో 9 సీట్లు, ఏడో తరగతిలో పది సీట్లు, ఎనిమిదో తరగతిలో ఏడు సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఏదైనా గుర్తింపు పొందిన ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలో 2024–25 సంవత్సరంలో ప్రస్తుతం నాలుగు నుంచి ఏడో తరగతి వరకు చదువుకుంటున్న గిరిజన విద్యార్థులై ఉండాలన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ. 2లక్షల లోపు ఉండాలని సంబంధిత హెచ్ఎం సంతకంతో దరఖాస్తులను ఈనెల 10లోగా ఐటీడీఏలోని గిరిజన అభివృద్ధి కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు 9701810567 నంబర్‌ను సంప్రదించాలని, వీటి ఎంపిక ఈనెల 12 ఆకులవారి ఘనపూర్‌లో పాఠశాలలో ఉంటుందని తెలిపారు.

హస్త కళలపై శిక్షణ

ములుగురూరల్, మార్చి 4 : మేదరి కులస్తులకు అటవీ శాఖ ఆధ్వర్యంలో చేతి వృత్తులపై మంగళవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వెదురు బొంగుల ద్వారా వస్తువులు తయారు చేయడంపై 30 మందికి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, ఎఫ్ఆర్వో డోలి శంకర్, ఎఫ్‌బీవోలు శ్యాంసుందర్, శివకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలి

ఏటూరునాగారం, మార్చి 4 : ఎంఎస్ఎంఈ పరిశ్రమలను సద్వినియోగం చేసుకోవాలని రిటైర్డు జీసీసీ జనరల్ మేనేజర్, ట్రైనర్ విజయ్ కుమార్ కోరారు. మండలకేంద్రంలోని వైటీసీలో ఎంఎస్ఎంఈ లబ్ధిదారులకు పరిశ్రమల నిర్వహణపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం చేపట్టగా ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు నెలకొల్పి ఆర్థికంగా బలపడాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం పెంచుకోవాలని, తయారీ రంగాలపై ట్రైనింగ్ తీసుకోవాలని సూచించారు. ఐటీడీఏ ద్వారా మంజూరు చేసిన యూనిట్లల్లో ఉత్పత్తిని పెంచి, ఇతర మహిళలకు ఆదర్శంగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సెంట్రల్ ఇనిస్టిట్యూట్ అసిస్టెంట్ డైరెక్టర్ ఉదయ్, ఉపేందర్, ఎంఎస్ఎంఈ యూనిట్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

విద్యార్థులు తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలి

ములుగురూరల్, మార్చి 4 : విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు, గురువుల పేరు నిలబెట్టాలని ములుగు డీఎస్పీ రవీందర్ అన్నారు. మంగళవారం ఇంచర్ల ట్రైబల్ వెల్ఫేర్ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలను నిరోధించడంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయగా డీఎస్పీతో పాటు ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ జదీశ్వర్ హాజరయ్యారు. డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. తోటి విద్యార్థులు ఎవరైనా అలవాట్లకు గురైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థి జీవితం మళ్లీ రాదని, కష్టపడి చదివితేనే రేపటి భవిష్యత్తు ఉన్నత స్థాయిలో ఉంటుందని సూచించారు. అనంతరం ఇంటర్ విద్యార్థులకు డీఎస్పీ, సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ ఝాన్సీ, ఎస్సై వెంకటేశ్వరరావు హాల్ టికెట్లను అందజేశారు.

ఉరేసుకొని టెన్త్ విద్యార్థి ఆత్మహత్య

శ్రీరామ్ నాని (ఫైల్)

చిట్యాల, మార్చి 4 : పదో తరగతి విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ముచినిపర్తిలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. శ్రీరామ్ నాని (16) ముచినిపర్తి గ్రామంలో అమ్మమ్మ జయలక్ష్మి–సారయ్య ఇంటి వద్ద ఉంటూ రెండేళ్లుగా జూకల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్నాడు. కాగా, నాని తల్లిదండ్రులు రమ్య, లక్ష్మయ్య ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో ఉంటున్నారు. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై–2 ఈశ్వరయ్య సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ విషయం తెలుసుకున్న వెంటనే నాని తల్లి రమ్య ఉరేసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. అనంతరం సమీపంలోని ఆసుపత్రిలోకి చేర్పించి వైద్యం అందించినట్లు సమాచారం. విద్యార్థి మృతదేహాన్ని సివిల్ దవాఖానాకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేయనున్నట్లు ఎస్సై చెప్పారు. కాగా, విద్యార్థి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలి

కృష్ణకాలనీ, మార్చి 4 : సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని గడ్డిగానిపల్లి, కొండంపల్లి భూసేకరణ పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు పునరావాస కేంద్రాలను అన్ని వసతులతో సిద్ధం చేయాలని భూపాలపల్లి ఆర్డీవో రవి అన్నారు. మంగళవారం సింగరేణి అధికారులతో కలిసి ఆయన గడ్డిగానిపల్లి, కొండంపల్లి గ్రామాల ప్రజలకు నిర్మించే పునరావాస కేంద్రాల స్థలాన్ని పరిశీలించారు. భూసేకరణ పనుల పురోగతి, ఆర్అండ్ఆర్ సైట్‌కు సంబంధించిన పనులపై సింగరేణి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ భూ సేకరణ పనులు వీలైనంత త్వరగా పూర్తిచేసి, ప్రజలకు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. జీఎం రాజేశ్వర్‌రెడ్డి, కేటీకే ఓసీ–2 ప్రాజెక్ట్ అధికారి వెంకటరామరెడ్డి, డీజీఎంలు సివిల్, ఈ అండ్ఎంలు రవికుమార్, అరుణ్ ప్రసాద్, ఎస్టేట్ అధికారి కార్తీక్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీల విజయంపై సంబురాలు

గణపురం/ కాటారం, మార్చి 4 : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీపాల్‌రెడ్డి, మల్కా కొమురయ్య విజయం సాధించడంతో మంగళవారం గణపురం, కాటారం మండలకేంద్రాల్లో పీఆర్టీయూ, టీపీయూఎస్, బీజేపీ నేతలు సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ గణపురం మండల అధ్యక్షుడు బిల్ల రఘునాథరెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు దూలం కుమారస్వామి. సతీశ్‌కుమార్, నాయకులు కుమ్మరి శ్రీనివాస్‌రెడ్డి. యుగంధర్, బాపు రాజేందర్, స్రవంతి, బాబూరావు, బీజేపీ పెద్దపల్లి జిల్లా మాజీ అధ్యక్షుడు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, కాటారం మండల అధ్యక్షుడు పాగె రంజిత్ కుమార్, ఫిల్మ్ సెన్సార్ బోర్డు మెంబర్ దుర్గం తిరుపతి, జిల్లా కౌన్సిల్ మెంబర్ బొమ్మన భాస్కర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు బండం మల్లారెడ్డి, పలిమెల మండల ఇన్‌చార్జి సంపత్, మల్హార్ కన్వీనర్ ఆత్మకూరి స్వామి యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

ఏఈవోలకు శిక్షణ